ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబర్ 2024
5
కర్నూలు





మొక్కలు నాటుతున్న ఎస్పీ బిందు మాధవ్

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- బాలల దినోత్సవంలో ఎస్పి జి.బిందుమాధవ్

ప్రజాశక్తి- వెల్దుర్తి

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్ సూచించారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని అల్లుగుండు గ్రామంలో బాలల దినోత్సవ వేడుకల్లో కర్నూలు ఎస్పి పాల్గొన్నారు. పాఠశాలకు వచ్చిన ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పి పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. క్లాస్ రూమ్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకొని ఈనెల 14న బాలల దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. అనంతరం స్వయంగా విద్యార్థులకు బిస్కెట్లు స్వీట్లు పంచారు. విద్యార్థుల ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగాచదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువులో ఏమైనా అర్థం కాకపోతే టీచర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులు మళ్లీ మళ్లీ అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి విద్యార్థినీలకు అర్థమయ్యే విధంగా తెలపాలని, వారి తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థినిలు కూడా ఏమైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే ఉపాధ్యాయులకు ,అమ్మానాన్నలకు తెలపాలని అన్నారు. ఎస్పితో పాటు సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పోలీసు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కారానికి...

కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

- సమస్యల పరిస్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం
- ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్ రెడ్డి
- ఎఒకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు మేలు చేయకుండా భారాలు వేసే పని పెట్టుకున్నదని, విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రజాపోరు పేరుతో ఈనెల 8 నుండి 13వ తేదీ వరకు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం కర్నూలు జిల్లాలో ప్రజాపోరు నిర్వహించింది. గురువారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కలెక్టరేట్ ముందు అధిక సంఖ్యలో ప్రజలు దాదాపు రెండు గంటల పాటు బైఠాయించారు. అక్కడికి కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయశ్రీ చేరుకొని సిపిఎం ప్రతినిధులు బృందం నుండి వినతిపత్రం స్వీకరించారు. ఈ సమస్యలన్నిటినీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల పాల్గొన్నారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నప్పటికీ రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. చంద్రబాబుకు రాష్ట్ర అభివద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే అమరావతి అభివృద్ధి కోసం ఎందుకు గ్రాంట్ రూపంలో నిధులు రాబట్టలేదని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరగడానికి కారణం అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించేందుకు ఎందుకు జంకుతున్నారని అన్నారు. తల్లికి వందనం పథకం ఎక్కడికెళ్ళిందని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ చేయడం గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని విమర్శించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు విద్యుత్ ఛార్జీలు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చెబుతుంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలన్నారు. మైనార్టీలకు నిజమైన మిత్రులం మేమే అని ఎన్నికల ముందు మైనార్టీ ఓట్లు దండుకున్న చంద్రబాబు వక్ఫ్ బిల్లు రద్దు గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ కర్నూలు జిల్లా అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎందుకు నిధులు కేటాయించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతున్నదన్నారు. పట్టపగలే బెల్ట్‌షాపులు వెలుస్తున్నాయని వాటిని అరికట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కర్నూల్ నగరంలో ఇంద్రమ్మ ఇల్లు సంవత్సరాల గడుస్తున్నా వాటి అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడే లేరన్నారు. నగరంలో మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం చొర చూపాలని, జిల్లాలో పాడైపోయిన రోడ్ల మరమ్మతులు వారు డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపకపోతే రాబోయే కాలంలో ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడి ముగింపు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, కెవి. నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ బాబు, గురుశేఖర్, ఎన్.అలివేలు, కర్నూలు కల్లూరు మండల కార్యదర్శులు హుస్సేనయ్య, మధు ఓర్వకల్ మండల కార్యదర్శి నాగన్న, నగర నాయకులు విజయ్, సాయిబాబా సుధాకరప్ప షరీఫ్ నర్సింహులు అబ్దుల్లా రామకృష్ణ అరుణ అబ్దుల్లా, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గూడూరు : సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం మండల కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్నా చేశారు. సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్ మాట్లాడారు.

వెల్దుర్తి : వెల్దుర్తి మండలం కేంద్రం లో తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్ మాట్లాడారు. ఎన్నికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, వేదికపై రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి



ఎఒ విజయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న గౌస్ దేశాయి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

కుడాను అభివృద్ధి బాటలో నడిపిస్తాం

- ప్రభుత్వ ఆదాయం పెంచే దిశగా ప్రణాళికలు
- కుడా చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన సోమిశెట్టి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కూడాను అభివృద్ధి బాటలో నడిపిస్తానని, అక్రమంగా లేఔట్లు వేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించబోనని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నూతన చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు నగరంలోని కుడా కార్యాలయంలో కుటుంబ సభ్యులు,టిడిపి నాయకులు, అధికారులు, అభిమానుల మధ్య జిల్లా జాయింట్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ బి.నవ్య సమక్షంలో పదవి బాధ్యతలను సోమిశెట్టి వెంకటేశ్వర్లు స్వీకరించారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ తన పై నమ్మకంతో 2వ సారి కుడా చైర్మన్ గా అవకాశం ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం నా పై నమ్మకంతో ఇచ్చిన పదవిని సక్రమంగా చేపట్టి వారు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అవినీతి అక్రమాలకు తావులేకుండా నిర్వర్తిస్తానని తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిని ఎవరిని వదిలి పెట్టేది లేదని అన్నారు. హంద్రీ, పోరంబోకు స్థలాలో , డిలైన్ పరిధిలో కొంత మంది అక్రమ లేఅవుట్లు వేసి ప్రభుత్వ రుసుం చెల్లించకుండా మొండి చేయిచూయిస్తున్నరని అలాంటి వారు ఏ స్థాయిలో ఉన్నా వదిలి పెట్టేది లేదని అన్నారు. కుడా కార్యాలయంలో సిబ్బంది తక్కువగా ఉన్నారని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి సిబ్బందిని పెంచుకునేందుకు , కావలసిన నిధులు రాబడతామని అన్నారు. ముఖ్యమంత్రికి, నారా లోకేష్‌కు, టిటి.భరత్‌కు, కృతజ్ఞతలు తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేశ్, కర్నూలు టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, మాజీ మార్కెటింగ్ చైర్మన్ నగరూరుశమంతకమణి, టిడిపి నాయకులు సోమిశెట్టి నవీన్, వై.నాగేశ్వరరావు యాదవ్, నందయల నాగేంద్ర, సోమిశెట్టి కిషోర్, ఎల్‌వి.ప్రసాద్, మహేశ్ గౌడ్, పేరపోగు రాజు, పి.చిన్న మారెన్న మొదలగు వారితో పాటు అభిమానులు పాల్గొన్నారు.



సోమిశెట్టితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జెసి డాక్టర్ నవ్య

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- వారోత్సవాలను ప్రారంభించిన ఎంపి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఎంపి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు తన విద్యార్థి దశలో ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వడంతో పాటు సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పార్లమెంటులో కూడా ఒక్క పెద్ద గ్రంథాలయం ఉందని, తాను ఎంపి గా ఎన్నికైన తరవాత అందులో సభ్యత్వం తీసుకున్నానన్నారు. దాని ద్వారా దేశంలో ఏ సంఘటన జరిగినా ఆ సమాచారం వెంటనే మొబైల్ ఫోన్‌కు వస్తుందని, ఇది కేవలం గ్రంథాలయానికే సాధ్యం అన్నారు. ఇక కర్నూలు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు విద్య పట్ల చైతన్యం కలిగి వలసలను కూడా నివారించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు ఏర్పాటు చేసిన వారోత్సవాల ప్రారంభోత్సవ ర్యాలీని ఎంపి జెండా ఊపి ప్రారంభించారు. గ్రంథాలయాల పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు విగ్రహానికి పూల మాలలు వేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సెక్రటరీ కె.ప్రకాష్, ఉపగ్రంథ పాలకురాలు వి పెద్దక్క, మాజీ గ్రంథాలయ చైర్మన్లు చంద్రశేఖర్ కల్‌కూర, కెజి.గంగాధర్ రెడ్డి, ఎంవి.ఆర్ చంద్రశేఖర్, నిఖిలేష్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షులు టి.మద్దిలేటి, సహాయ గ్రంథపాలకులు వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ నాగరాజు



డయాబెటిక్ హెల్త్ చెకప్ ప్యాకేజీ విడుదల చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

షుగర్ వ్యాధిపై అవగాహన అవసరం

డయాబెటిక్ డే సదస్సులో సిఇఒ డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు కొత్త బస్టాండ్ నందు గల జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ డయాబెటిక్ డేని పురస్కరించుకొని ప్రత్యేక సదస్సును నిర్వహించారు. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ ఎండి, సిఇఒ ,డయాబెటాలజిస్ట్ ,జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకప్పుడు రూ.50 ఏళ్ల తర్వాత వచ్చే మధుమేహం ఇప్పుడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాల వల్ల 20 నుంచి 30 ఏళ్ల వాళ్లకు కూడా వస్తున్నదన్నారు. మధుమేహంపై ప్రజలు అవగాహన పెంచేందుకు అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య 2006 నుంచి వరల్డ్ డయాబెటిక్ డేను నిర్వహిస్తుందన్నారు. 1972లో సర్ ఫ్రెడరిక్ బాంటింగ్ ఇన్సులిన్ కనిపెట్టడంతో ఆయన పుట్టినరోజు నవంబర్ 14న వరల్డ్ డయాబెటిక్ డే గా జరుపుకుంటారని తెలిపారు. డయాబెటిక్‌ను స్క్రీనింగ్ ద్వారా కనిపెట్టిన వెంటనే కొద్దిపాటి ఆహారపు అలవాట్లు మార్చుకొని శారీరక శ్రమను పెంచితే డయాబెటిక్‌ను అదుపులో ఉంచుకోవచ్చని చెప్పారు. వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా తమ హాస్పిటల్ లో డయాబెటిక్ హెల్త్ చెకప్ ప్యాకేజీ విడుదల చేసిందన్నారు. కేవలం రూ.499 కే తినక ముందు, తిన్న తర్వాత బ్లడ్ షుగర్ టెస్ట్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ , హెచ్‌బిఎ వన్ సి , లిపిడ్ ప్రొఫైల్ , సీరం క్రియాటిన్, జనరల్ ఫిజీషియన్, డయాబెటిక్ కన్సల్టేషన్‌లు అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్యాకేజ్ ఈనెల14 నుంచి 13 డిసెంబర్ 2024 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. హాస్పిటల్స్ డైరెక్టర్స్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ రవిబాబు, డాక్టర్ రాఘవేంద్ర, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ రామ్మోహన్, హాస్పిటల్ సిఒఒ డాక్టర్ గణేష్, ఆపరేషన్స్ హెడ్ నదీమ్, ఆపరేషన్స్ ఎజిఎం డాక్టర్ కృష్ణవేణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి శాప్ చైర్మన్‌ను కలిసిన పత్తికొండ టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పత్తికొండ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడును తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టిడిపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు నరసింహులు చౌదరి, ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటపతి ,పత్తికొండ టిడిపి ఆఫీస్ ఇంచార్జి హరినాథ్ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బత్తిని లోకనాథ్ మాట్లాడుతూ పత్తికొండలో క్రీడాభివృద్ధి కోసం నిధులు కేటాయించి, రాష్ట్ర అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల ఎదుగుదల కోసం సహాయ సహకారాలు అందించాలని అన్నారు. పత్తికొండలోని కెవికె స్టేడియం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రీడా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రవీంద్రలో ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర విద్యాసంస్థలలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రవీంద్ర బాలికల పాఠశాల, రవీంద్ర ఐసి పాఠశాలలు సంయుక్తంగా నిర్వహించుకున్నారు. పాఠశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య విద్యాసంస్థల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్ , అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ జి.మమత మోహన్ పాల్గొన్నారు. జి పుల్లయ్య మాట్లాడుతూ చాచా నెహ్రూ జీవితం భారత దేశ ప్రజలకు ఎంతో ఆదర్శమన్నారు. వారి దృఢ సంకల్పాన్ని, మనోనిబ్బరతను, శాంతిని విద్యార్థులు అందిపుచ్చుకొని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. జివిఎం మోహన్ కుమార్ మన శాస్త్ర సాంకేతిక ప్రగతిని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయంటే దానికి ప్రధాన కారణం ఆనాడే నెహ్రూ తీసుకున్న నిర్ణయాలన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రవీంద్ర గ్లోబల్ స్కూల్లో రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి.వంశీధర్, రవీంద్ర, ప్రైమరీ విభాగం , రవీంద్ర ప్రీ ప్రైమరీ విభాగమునకు శ్రీకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాలల సమన్వయకర్తలు ధనలక్ష్మి, భబిత, హేమలత, స్వాతి,చంద్రశేఖర పాల్గొన్నారు.



రవీంద్ర విద్యాసంస్థలో బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న జివిఎం మోహన్

సాయి సుబ్బయ్య రవీంద్ర స్కూల్స్‌లో : కర్నూలు మాధవినగర్ రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు , రెవెన్యూ కాలనీ రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో 'బాలల దినోత్సవ వేడుకలు' కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు. పిబివి.సుబ్బయ్య మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు బాలల దినోత్సవ వేడుకలుగా జరుపుకొను ప్రాధాన్యత గురించి వివరించారు. పిల్లలు జ్ఞానం పెంచుకొని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని హితవు పలికారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ పిల్లలను ఉద్దేశించి విరిసీవిరియని సుమాలు.... అభం శుభం తెలియని బాలలు..... భావి భారత పౌరులు..... భవిష్యత్తు జాతి సంపద అని అన్నారు. పిల్లలు సెల్ వినియోగ బారిన పడకుండ ఉండాలని వారిని ఉద్దేశించి "సెల్లు పురాణం" అనే పుస్తకాన్ని రచించి అందులోని కొన్ని పద్యాలను చదివి వినిపించారు. చివరిగా నెహ్రూ ఆశయం చిన్నారుల జ్ఞానాభివృద్ధి ద్వారా దేశాభివృద్ధి సాధించ వచ్చునని తెలిపారు.వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ శారద, సుభద్ర, కోఆర్డినేటర్స్ అక్తర్ బేగమ్, సౌజన్య, అడ్మిన్ బాల తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సి బెళగల్ : మండలంలో నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం వేడుకలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆసక్తి గలిగిన విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. అలాగే క్విజ్ పోటీలను చేపట్టగా ప్రతిభచూపిన వారికీ బహుమతులిచ్చారు.



నెహ్రూకు నివాళి అర్పిస్తున్న పత్తిఓబులయ్య, పిబివి సుబ్బయ్య, సిబ్బంది , విద్యార్థులు

అన్ని వార్డులలో అభివృద్ధిపనులు

నగరపాలక సంస్థ మేయర్ బివై. రామయ్య

10 అజెండాలకు స్థాయీ సంఘం ఆమోదముద్ర

రూ.3.81 కోట్ల నిధుల ఖర్చుకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తూ, అన్ని వార్డులకు సమాంతరంగా నిధులు కేటాయిస్తున్నామని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, సభ్యులు ఎం.విక్రసింహా రెడ్డి, మిద్దె చిట్టమ్మ, క్రాంతికుమార్, జుబేర్, యూనూస్, అధికారులు హాజరయ్యారు. సాధారణ నిధుల నుండి రూ.3,81,43,000 నిధులను ఖర్చు చేయడానికి ఆమోదముద్ర వేశారు. 9 వార్డులలో అభివృద్ధి పనులు, క్లాప్ ఆటో డ్రైవర్లకు మరో 4 నెలల బకాయిల వేతనాలు చెల్లింపునకు అంశాలు కీలకంగా ఉన్నాయి. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఇ జి.రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒ జునైద్, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, ఎంఇలు సత్యానారాయణ, శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, సి3 జి.ఎం. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల్లో నాయి బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎపి స్టేట్ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్‌లో తనను డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు, మంత్రి టీజీ భరత్‌కు, ఇన్చార్జి మంత్రి నిమ్మల రామా నాయుడుకు, ఎంపీ నాగరాజుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి, జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డికి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌కు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవీటి విజయకుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా అప్పజెప్పిన బాధ్యతను శిరసా వహిస్తానని అన్నారు. నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి తోడ్పడుతానని దేవాలయాలలో పనిచేస్తున్న భజంత్రీలకు, క్షురకులకు, వృత్తి చేసుకునే నాయి బ్రాహ్మణులకు, వృద్ధ కళాకారులకు, నాయి బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని పోయి వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తానని అన్నారు.

సంకల్‌బాగ్ సుందరీకరణతో సరికొత్త శోభ

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తుంగభద్ర నది ఒడ్డున సంకల్‌బాగ్‌ను సుందరీకరించి సరికొత్త శోభ తీసుకొస్తామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు వెల్లడించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి సంకల్‌బాగ్, బుధవారపేట ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ సంకల్‌బాగ్ వద్ద తుంగభద్ర నది తీరాన బంక్‌రోడ్డు విస్తరించి, వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో మౌలిక వసతులతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పలు కీలకమైన పనులు చేపడుతున్నామని, ప్రాధాన్యత క్రమంలో పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. 15వ వార్డు బుధవారపేట చాపల్ గుంతవద్ద జరుగుతున్న గ్రావెల్, వాకింగ్‌ట్రాక్ పనులను పరిశీలించారు. సాముహిక మరుగుదొడ్లు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ శివమ్మ, పామన్నకోరగా, ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. డిఇఇ గంగాధర్, శానిటేషన్ ఇంస్పెక్టర్లు రమేష్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు

నగరపాలక సంస్థలో పి.ఈశ్వరమ్మ అనే మహిళ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ గతేడాది మరణించింది. ఆ పోస్ట్‌ను కారుణ్య నియామకం కింద తిరిగి ఆమె కుమారుడు పి.రామేశ్వరుడుని నియమిస్తూ గురువారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు, సూపరింటెండెంట్ మంజూర్ బాష, ఈ1 మన్సూర్ బాష పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

- నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - హొళగుంద

గత రెండు, మూడు రోజులుగా ఈదురు గాలులతో కూడిన చినుకులు కురవడంతో వరి పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలను పరిశీలించాల్సిన వ్యవసాయాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన చినుకులు కురవడంతో వరి పంటలు నేలమట్టమయ్యాయి. వరి సాగుకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశామని, పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. వరి పంట నేలకొరగడంతో మొలకలు వస్తున్నాయని, చేతికొచ్చిన పంట నోటి దాకా రాకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చాలామంది రైతులకు వర్షాలు అవసరం లేదని పేర్కొంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రతిసారీ తుఫాను ప్రభావం వల్ల రైతు నష్టపోతున్నారని, అరకొరగా చేతికొచ్చిన పంటను మార్కెట్లో వ్యాపారులు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం పంట పొలాలను పరిశీలించి ఏ మేర నష్టం జరిగిందో అంచనా వేసి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు తొత్తులుగా అధికారులు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశులు

ప్రభుత్వ ఉద్యోగులు ఎమ్మెల్యేకు తొత్తులుగా మారి వారి పనులు చక్క పెడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు మండి పడ్డారు. ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు నివారించాలని, పాండవగల్ ఫీల్డ్ అసిస్టెంట్గా వీరమ్మను కొనసాగించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పెద్దతుంబలం, కుప్పగల్లు, బల్లేకల్లు, పాండవగల్లు, జాలమంచి, గణేకల్లు, దొడ్డనకేరి, మాంత్రికి, పెసలబండ, కపటి, ఆరెకల్లు, నాగలాపురం గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వలస వెళ్లారని తెలిపారు. వలసల నివారణకు అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. 18 ఏళ్లుగా వంద శాతం పనులు కల్పిస్తూ వందరోజుల పని అత్యధిక మందికి కల్పించిన పేరు ఉన్న పాండవగల్ ఫీల్డ్ అసిస్టెంట్ను తొలగించడం సమంజసం కాదని విమర్శించారు. మండలాధికారులు జోక్యం చేసుకొని పాండవగల్ ఫీల్డ్ అసిస్టెంట్గా వీరమ్మనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్కు, ఇన్ఛార్జీ ఎపిఒ కాలిక్ బాషకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు, మండల నాయకులు శేఖర్, రామాంజనేయులు, బాష, లక్ష్మన్న, హనుమంతు రెడ్డి, శాఖ కార్యదర్శులు గోవిందు, కె.వెంకటేష్, దస్తగిరి బాష, బసరకోడు రామాంజనేయులు, మునిస్వామి, కర్ణ, అయ్యన్న పాల్గొన్నారు.

సచివాలయం ద్వారా ఇసుక

- జిల్లా మైనింగ్ అసిస్టెంట్ అధికారి బాలనాయక్

ప్రజాశక్తి - కౌతాళం


మాట్లాడుతున్న అధికారులు

ఇసుక కావాల్సిన వారు గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇసుకను పొందాలని జిల్లా మైనింగ్ అసిస్టెంట్ అధికారి బాలనాయక్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని మురళి గ్రామం వద్ద ఇసుక రీచ్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక టన్ను ఇసుకకు రూ.119 చెల్లించి ట్రాక్టర్ నెంబర్, డ్రైవర్ ఫోన్ నెంబర్ నమోదు చేయించాల్సి ఉంటుందన్నారు. కౌతాళం మండల, గ్రామస్తులకు మాత్రమే అని పేర్కొన్నారు. నదీతీరంలోని గ్రామస్తులు ఇసుకను ఉచితంగానే పొందవచ్చని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే ట్రాక్టర్ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సిఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాయలసీమ రేంజ్ విశ్రాంత ఐజి మహ్మద్ ఇక్బాల్ విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. మహ్మద్ ఇక్బాల్ గతంలో గోనెగండ్ల ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కొరత ఉన్నట్లు తెలుసుకొని విద్యార్థుల వివిధ రకాల ఆటలకు అవసరమైన క్రీడా సామగ్రిని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సతీష్ ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణంకు గురువారం బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్బాల్, సాఫ్ట్బాల్ లాంటి వివిధ క్రీడా సామగ్రిని అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు అమానుల్లా బేగ్, షఫీ, వెల్ఫేర్ అసిస్టెంట్ విరుపాక్షి పాల్గొన్నారు.

బాదుడే.. బాదుడు మానుకోవాలి

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రజలపై భారం మోపే 'బాదుడే.. బాదుడు'ను మానుకోవాలని సిపిఎం నేతలు మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు (ట్రూ అప్), నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఎన్డిఎ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. అంతకుముందు మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు మాట్లాడారు. 'ప్రజా పోరు'ను చేపట్టి క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించామని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని కోరారు. ఎన్డిఎ ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.18 వేల కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్కు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.గోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, పాండవగల్ సర్పంచి కె.ఉమాదేవి, సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు డి.రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు బి.తిప్పన్న, ముక్కన్న, మండల, పట్టణ కమిటీ సభ్యులు బాష, రామాంజనేయులు, తిక్కప్ప, లక్ష్మన్న, హనుమంతు రెడ్డి, నాగరాజు, వీరేష్, వెంకటేష్ ఉన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహశీల్దార్ గోవింద్ సింగ్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయించాలని, సిద్ధేశ్వర కాలనీ, సిపిఎం కొట్టాలలో వీధి లైట్లు, రోడ్లు, తాగునీరు, ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈరన్న, నాగరాజు, మైనా, షేకున్ బీ, విఠల్, గౌసియా, రాధమ్మ, వీరేష్, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు రాముడు, లక్ష్మీ నరసయ్య, కృష్ణ, కార్యకర్తలు అబ్బాస్, విజయ్, యాసిన్, మాబు, రహిమాన్, సురేష్, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కాశప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులు జయరాజు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్.డి.ఆంజిబాబు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందించారు. సిపిఎం నాయకులు ప్రాణేష్, సురేష్, అంజి, అనిల్, ఇస్మాయిల్, రాజు, తిక్కన్న, ఆంజనేయ పాల్గొన్నారు. **ఆస్పరి** సిపిఎం కార్యాలయం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. నాయకులు రంగస్వామి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు మాట్లాడారు. అనంతరం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బాలకృష్ణ, సీనియర్ నాయకులు రామాంజనేయులు, మాణిక్యప్ప, నరసింహులు, చిన్న ఈరన్న, రవి, వీరభద్ర, నవీన్, వీరేష్, మహేంద్ర పాల్గొన్నారు. **కౌతాళం** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడారు. సిపిఎం నాయకులు ఉల్లిగయ్య, వీరేష్, హుసేని, ఈరన్న, చిన్న మారయ్య, రామాంజనేయులు, దావీదు, వెంకటేష్ పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ, ధనుంజయ్, బొజ్జప్ప, దర్గప్ప పాల్గొన్నారు.


ఆదోనిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు


ఆలూరులో మాట్లాడుతున్న రాధాకృష్ణ


ఎమ్మిగనూరులో


మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆస్పరిలో

'17న వాల్మీకుల వనభోజనం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 17న పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్లో వాల్మీకుల వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు, వాల్మీకి కుల బాంధవులు, శ్రేయోభిలాషులు హాజరై జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. గురువారం వాల్మీకి సంక్షేమ భవన్ స్థల ఆవరణలో వనభోజన సమితి నాయకులు బంగారు వెంకటేష్, కొండయ్య, బిఎల్.నారాయణ, దయా సాగర్, రామకృష్ణ, రంగన్నలు కరపత్రాలను విడుదల చేశారు. వాల్మీకుల కోసం ఫంక్షన్ హాల్ నిర్మిస్తానని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జగ్గాపురం ఉరుకుంద, శ్రీరాములు, లక్ష్మన్న, రంగస్వామి, యాపిలయ్య, జయరాముడు, శ్రీనివాసులు, తిమ్మయ్య పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

18న మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సు

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 18న కర్నూలు నగరంలోని కోల్స్ కళాశాల మైదానంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎంఆర్పిఎస్ మండల ఇన్ఛార్జీ భీమా మాదిగ తెలిపారు. గురువారం హొళగుందలో ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు పకీరప్ప మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా సీనియర్ నాయకులు, మండల ఇన్ఛార్జీ భీమా మాదిగ హాజరయి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలో గ్రూప్-1, డిఎల్, జెఎల్, డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు భర్తీ ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న కర్నూలు నగరంలోని కోల్స్ కళాశాల మైదానంలో జరిగే ఉమ్మడి జిల్లా సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. మండల సీనియర్ నాయకులు లింగపల్లి శేషగిరి, గోవిందు, రాముడు, ఎంపిటిసిలు మల్లికార్జున, కెంచప్ప, శివలింగ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ప్రాజెక్టుల పూర్తితో

పశ్చిమ ప్రాంతానికి మహర్దశ

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన నిధులతో ప్రాజెక్టుల పూర్తితో పశ్చిమ ప్రాంతానికి మహర్దశ రానుందని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక భూరమణ కల్యాణ మండపంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న వేదవతి, గుండ్రేవుల, ఆర్డిఎస్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అసెంబ్లీలో నిధుల మంజూరుకు ఆమోదం తెలిపిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఆలూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్లేవారని తెలిపారు. వలసలను నివారించేందుకు ప్రాజెక్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని చెప్పారు. వంద రూపాయలతో టిడిపి సభ్యత్వం నమోదు తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమా ఉంటుందని తెలిపారు. తుంగభద్ర నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రంలోని కొందరు ముందుకొచ్చారని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం మంత్రాలయం కింది భాగంలో నిర్మాణం చేపడితే స్నానాలకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. కోసిగి మండలం కడదొడ్డి గ్రామంలో తండ్రిలాగా కాపాడుకోవాల్సిన సర్పంచి 8 ఏళ్ల చిన్నారిని అత్యాచారం చేసేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, కోసిగి మండల నాయకులు భరద్వాజ్ శెట్టి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, హండె హనుమంతు, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, పవన్ కుమార్, గువ్వల భీమన్న, అబ్దుల్, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబు పాల్గొన్నారు.

దోచుకుని.. దాచుకోవడానికే 'కూటమి'

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దోచుకుని.. దాచుకోవడానికే కూటమి నాయకులు పని చేస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి ఏనాడూ పని చేయలేదని టిడిపి ఇన్ఛార్జీ వీరభద్ర గౌడ్ను ఉద్దేశించి ఎమ్మెల్యే బి.విరుపాక్షి అన్నారు. గురువారం ఆలూరులోని ఆర్అండ్బి గెస్ట్ హౌస్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను జడ్పిటిసిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నా ఎవరి దగ్గర, ఎలాంటి పనుల్లో కమీషన్ల కోసం కక్కుర్తి పడలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించినా ప్రజా సేవకు, నియోజక అభివృద్ధికి ఎప్పుడూ అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించాలనుకున్నా స్పీకర్ ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు నిరాకరించినందుకే అధిష్టానం ఆదేశాల మేరకు అసెంబ్లీకి వెళ్లడం లేదన్నారు. వీరభద్ర గౌడ్ తన గురించి మాట్లాడే ముందు ఆచితూచి మాట్లాడాలన్నారు. 2014 నుంచి 2019 వరకు, ప్రస్తుతం 2024లో అధికార పార్టీ ఉండి.. నియోజకవర్గ ఇన్ఛార్జీగా ఉండి ఎంత దోచుకుని.. దాచారో ప్రజలకు తెలుసన్నారు. డీలర్ షిప్, అంగన్వాడీ పోస్టులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఉద్యోగుల బదిలీలకు రూ.లక్షలు తీసుకుని, ప్రతి పనిలో కమీషన్లకు కక్కుర్తి పడ్డారని విమర్శించారు. గత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఇన్ఛార్జీగా ఉన్న వీరభద్రగౌడ్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. వారు అభివృద్ధి చెందారని, నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను నట్టేట ముంచారని మండిపడ్డారు. మండల కో కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపిటిసి నాగేంద్ర, జె.వీరేష్, సుంకలయ్య, రాముడు, తిక్కస్వామి పాల్గొన్నారు.

చదువులో ప్రతిభ చూపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగం పొందటానికి ఆస్కారం ఉంటుందని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. ఆస్పరి మండలం తంగరడోన గ్రామానికి చెందిన పండు కుమార్తె శిరీష అనంతపురం జిల్లాకు చెందిన అమెరికన్ కళాశాలలో సీటు సాధించిన నేపథ్యంలో గురువారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే విరుపాక్షి స్వగ్రామానికి వచ్చి విరుపాక్షిని కలిశారు. సీటు పొందిన శిరీషను అభినందిస్తూ.. చదువులో మరింత ముందుకెళ్లాలని, రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. విరుపాక్షి మాట్లాడుతూ... దిగువ తరగతి కుటుంబాల్లో ఉన్నత చదువులు చదవాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థిక స్తోమత లేక చదువు మీద ఆసక్తి ఉన్నా కొంతమంది ఇంటి దగ్గరే ఉండిపోవడం బాధాకరమని చెప్పారు. చదువులో మంచి ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. బిణిగేరి సర్పంచి వెంకటేష్ పాల్గొన్నారు.


శిరీషకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

మహనీయులు ఆదర్శం

- డీఎస్పీ సోమన్న

ప్రజాశక్తి - ఆదోని

మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆదోని డీఎస్పీ సోమన్న తెలిపారు. గురువారం పట్టణంలోని ఎన్జిఒస్ కాలనీలో ఉన్న భాష్యం హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. డీఎస్పీ సోమన్న ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు . చదువుతో పాటు క్రీడల పట్ల కూడా విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని సూచించారు. సిఐ అనిల్ కుమార్, అసిస్టెంట్ జడ్ఇఒ మాచాని కవిత, ప్రిన్సిపల్ రవి ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ అంజి, ప్రధానోపాధ్యాయులు తేజస్విని ఉన్నారు. అలాగే ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఉన్న భాష్యం స్కూల్లో ప్రిన్సిపల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని కిలిచిన్ పేటలో మున్సిపల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బాలచంద్రుడు, బ్రహ్మానంద రెడ్డి, చక్రపాణి, చంద్రకళ, జేరిష రత్న కుమారి, ఆనందమ్మ, ఇందు ఉన్నారు. అలాగే ఆదోని అవోపా, వామ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బార్ పేటలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో బాల దినోత్సవం నిర్వహించారు. నోటు పుస్తకాలు, పెన్నులు, కలరింగ్ కిట్లు, మిఠాయిలు విద్యార్థులకు పంపిణీ చేశారు. పట్టణ అవోపా, వామ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, ఎన్.రఘు, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి శంకరమ్మ, లయన్స్ జిల్లా ఛైర్మన్లు డాక్టర్ గోపినాథ్, ప్రసాద్ రావు, సభ్యులు మల్లికార్జున గౌడ్, వన్నపరాజు, అవోపా, వామ్ మహిళ విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉన్నారు. అలాగే ఆదోనిలో వింధ్యశ్రీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వీరేష్ మాట్లాడుతూ... ప్రతి చిన్నారీ బడికి వెళ్లి బాగా చదివి ప్రయోజకులు కావాలని, చదువుతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి చెందుతారని తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ధ్రువపత్రాలను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కె.జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పిఎస్.నాగేంద్ర, ఉపాధ్యాయులు ప్రతాప్, నిత్యానంద్, శ్వేతామయ, లలిత శివజ్యోతి, బషీర్బాను పాల్గొన్నారు. **ఆస్పరి** జడ్పి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో గతేడాది 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచి మూలింటి రాధమ్మ, జిల్లా కెడిసిసి మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర చేతుల మీదుగా నగదు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్కూల్ టాపర్ ప్రశాంతికి రూ.5 వేలు, రవికి రూ.3 వేలు, లక్ష్మీకి రూ.2 వేలు అందజేశారు. వచ్చే ఏడాది కూడా టాపర్స్కు నగదు పురస్కారం కొనసాగిస్తామని, మరింత ఎక్కువ మంది పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు. మాజీ డైరెక్టర్ సంజన్న, టిడిపి యూత్ నాయకులు సతీష్ కుమార్, మారేష్, పిఇటి ఆనంద్ పాల్గొన్నారు. అలాగే ఆస్పరిలోని నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నృత్య కార్యక్రమాలు, ఆటలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **గోనెగండ్ల**లోని ఎపి మోడల్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ-1 రామాంజనేయులు, ఎంఇఒ-2 నీలకంఠ, బాలల హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ లింగన్న హాజరయ్యారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్లో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను ప్రదర్శించి వివరించారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, వైస్ ప్రిన్సిపల్ నల్లమల పద్మావతి, ఎస్ఎంసి ఛైర్మన్ గౌస్, వైస్ ఛైర్మన్ విమల పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులు వివిధ వేషధారణలో వారి వేషాలను పరిచయం చేస్తూ, నృత్యం చేశారు. చిన్నారులు రకరకాల పాటలకు నృత్యం చేసి అబ్బురపరిచారు. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్, ఉపాధ్యాయులు భీమేష్, జయలక్ష్మి, రాజు, ఈరన్న, శిరీష, ముంతాజ్, విరుపాక్షి, శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. దేవనకొండలో ఎఫ్ఆర్ హై స్కూల్, రెయిన్బో, సరస్వతి విద్యానికేతన్, జ్ఞాన సుధా, విబిఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



డీఎస్పీని సన్మానిస్తున్న అంజి



ఆస్పరిలో ప్రోత్సాహం అందిస్తున్న సర్పంచి దంపతులు



గోనెగండ్లలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సిబ్బంది


కౌతాళంలో వివిధ వేషధారణలో ఉన్న విద్యార్థులు

'అభివృద్ధి'లో భాగస్వామ్యం కావాలి

- డిఎల్పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఆదోని: మాట్లాడుతున్న డిఎల్పిఒ నూర్జహాన్

గ్రామాభివృద్ధి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డిఎల్పిఒ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆదోని ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పల్లెస్థాయిలో అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఏపీడీ లోకేష్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మధుకృష్ణ ఆచారి పాల్గొన్నారు. **ఆస్పరి** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రైనర్ కృష్ణ, సురేష్లు హాజరైన సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ గీతా వాణి, డిఎల్పిఒ వీరభద్రప్ప, ఇఒఆర్డి విజయభాను పాల్గొన్నారు. **హాలహర్వి** మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఒ వరలక్ష్మి మాట్లాడారు. వలస రహిత మండలంగా చూడాలని, పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఎపిఒ చక్రవర్తి, పిఆర్ ఎఇ సోమన్న పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖుల సందడి


ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని భూరమణ కల్యాణ మండపంలో జరిగిన వట్టెప్ప గారి వివాహ వేడుకలో ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గురువారం బీసీ సెల్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ కుమార్తె అనన్య (పద్మావతి), ఆంజినేయులు వివాహం జరిగింది. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాస రాజాచార్, పూజారి గోపాలకృష్ణాచార్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్రెడ్డి, క్లస్టర్ ఇన్ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కెడిసిసి మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ సంజప్ప, నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి చేతుల మీదుగా ప్రారంభించారు. గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, బాలల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో దొరికే పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఈనెల 14 నుంచి 20 వరకు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు 20న బహుమతులు అందజేస్తామని తెలిపారు. నోబుల్ స్కూల్ ఉపాధ్యాయులు జంసుర్ వలీ, టిడిపి యూత్ నాయకులు సతీష్ కుమార్, మారేష్, పాఠకులు హనుమంతు రెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, నరసప్ప పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, ఆలూరు శాఖ గ్రంథాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆలూరు గ్రంథాలయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అగ్రహారం ఈరన్న, విశ్రాంత సైనికుడు నర్సి రెడ్డి, రామ్మూర్తి నాయుడు చేతుల మీదుగా గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి, బాలల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **పెద్దకడబూరు**లోని ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సర్పంచి ఎం.రామాంజనేయులు హాజరయ్యారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవ వేడుకలను చిన్నారుల మధ్య నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కె.ఆశాజ్యోతి మాట్లాడారు.


ఆస్పరిలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

వలసలు వెళ్లొద్దు.. ఉపాధి కల్పిస్తాం : ఎపిఒ


ప్రజాశక్తి - మంత్రాలయం

పనుల కోసం వలసలు వెళ్లొద్దని, గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని ఎపిఒ తిమ్మారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిలుకల డోన, సింగరాజనహల్లి గ్రామాల్లో గ్రామసభల ద్వారా ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఇసి సూర్య ప్రకాష్, టిడిపి సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, సర్పంచి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరిడికొండ గ్రామంలో గురువారం చెత్త సేకరణకు ఉపయోగించే బుట్టలను సర్పంచి హనుమంతు, పంచాయతీ కార్యదర్శి రిబిక ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. టిడిపి నాయకులు లక్ష్మన్న, జనసేన నాయకులు నందు పాల్గొన్నారు.


చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న రిబిక

కస్తూరిబా ఎస్ఒను తొలగించకపోతే పోరాటం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కస్తూరిబా పాఠశాలలో అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఒను తొలగించకపోతే పోరాటం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, శేఖర్, మహేంద్ర బాబు, వీరేష్ యాదవ్, సురేంద్ర బాబు, కృష్ణ, రఘునాథ్, అజిత్, వెంకటేష్, నాగరాజు హెచ్చరించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు చాంద్ బాషా, చరణ్, హరి, నరసింహా రెడ్డి, దావీదు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మీనాక్షినాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ప్రముఖ న్యాయవాది వైఆర్.మల్లికార్జున కుమారుడు వివాహ వేడుకల్లో ప్రముఖులు సందడి చేశారు. గురువారం పట్టణంలోని చేకూరి ఫంక్షన్ హాలులో జరిగిన ఆదర్శ్, భావన వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. జడ్జీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, పోలీసులు హాజరయ్యారు.

సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం కోఆపరేటివ్ స్టోర్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా స్టోర్ పర్సనల్ ఇన్ఛార్జీ మురళీ రామరాజు, కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ గట్టు అల్తాఫ్ సహకార జెండాను ఆవిష్కరించారు.